

# అద్వైతం

## – శారద (బ్రిస్బేన్)

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

## 1998-మార్చి

బేగంపేట విమానాశ్రయంలో మూణ్ణెల్ల ఎడబాటు తరవాత అశోక్‌ని చూసి సంతోషంగా దగ్గరకొచ్చింది భాను. ఎనిమిదేళ్ళల్లో ఇంతకాలం ఒకరినొకరు విడిచి వున్నదే లేదు. ఏర్‌పోర్టుకి అతనొక్కడే వొచ్చాడు.

"మీ అమ్మా, నాన్న అంతా మన ఇంట్లో ఎదురు చూస్తున్నారు " అన్నాడు ఆమె సామాను టాక్సీ డిక్కీలోకెక్కిస్తూ.

"కొత్త ఇల్లు ఎలా వుంది అశోక్? నేను లేకుండా ఇల్లు మారాల్సొచ్చింది. కష్టమైందా?" మాట్లడుతూనే వుంది కానీ, అశోక్‌లో ఏదో మార్పు అనిపించింది భానుకి. ఎప్పుడూ లేనిది కొంచెం ఒళ్ళొచ్చింది. ఎప్పుడూ నవ్వుతున్నట్టుండే చురుకైన కళ్ళు కొంచెం కళావిహీనంగా అనిపించాయి. మూడే మూడు నెలల్లో ఇంత మార్పా!

"ఏమైంది అశోక్? డల్‌గా వున్నావెందుకని?"

"డల్‌గానా? ఏమీలేదు భాను. రాత్రి సరిగ్గా నిద్రపోలే, అంతే."

"అత్తయ్య, అమ్మూ బానే వున్నారుగా?"

"ఆల్ గుడ్ అమ్మాయ్! నువ్వు జర్మనీ ముచ్చట్లు చెప్పు. చుట్టు పక్కల ఏమేం చూసావో, ఆఫీసు స్టాఫ్ ఎలా వున్నారో, అన్నీ!"

"ఏం జర్మనీ లే! దాదాపు నెల కిందటి వరకూ పిచ్చి చలి. కిందటి రెండు వారాలూ కాస్త నాలుగు వూళ్ళూ తిరిగొచ్చా. ఇంటికెళ్ళాక ఫోటోలు చూపిస్తా."

ఇంటిదగ్గర, ప్రభావతీ, సుమిత్రా, అమూల్యా, పద్మనాభమూ ఎదురు చూస్తూ వున్నారు.మూడు నెలల తరవాత చూస్తున్న కుటుంబ సభ్యులని ఒక్కొక్కళ్ళనీ ప్రేమగా హత్తుకుంది భాను. కొత్త ఇల్లు బాగానే సర్దారు కానీ, మళ్ళీ తను ఇంకా అందంగా సర్దాలి, అనుకుంది.. ఉత్సాహంగా ఇల్లంతా తిరిగింది.

"వొదినా, నువ్వు లేకుండా నాకు బాగా బోరుకొట్టింది. అమ్మైతే రోజుకి కనీసం వంద సార్లు నిన్ను తలచుకునేది. ఈసారి నువ్వెక్కడికెళ్ళినా వెంట నేనూ వొస్తా."

"అబ్బో, అదీ చూస్తా! ఈ మాటలకేంలే. నీ పెళ్ళయి వెళ్ళింతరవాత మమ్మల్ని ఎన్నిసార్లు చూడడానికొస్తావో!"

"సంబంధం కుదిరిందా అమ్మూకి?" కుతూహలంగా అడిగింది ప్రభావతి.

"రెండు వారాలకిందటే అంతా కుదిరింది వొదిన గారూ. భాను రాగానే మీతో చెప్పాలని అనుకుంటూ వున్నాం."

ప్రభావతికి ఒక్కసారి కొంచెం ఈర్ష్యలాటి నొప్పి కలిగింది. తన కూతురి చుట్టూ ఏవో బంధాలు బిగుసుకుంటూ వున్నాయి, పైగా వాటిలో తన ప్రమేయమేమీ లేకుండా పోతుంది.

పెళ్ళయి తమకంటూ ఒక ఇల్లూ, కుటుంబమూ ఏర్పరుచుకున్నాక పిల్లలు అమ్మా నాన్నలనుంచి కొంచెం వేరు పడటం సహజమే అని తెలుసు కానీ, అది ఇంత నొప్పిగా వుంటుందని తెలియదామెకి, అందరు అమ్మలకి లాగానే.

పైగా,

“అత్తయ్యా! మూడు నెలల తరవాత మీ చేతి పప్పు చారు! ప్రాణం లేచొచ్చింది. నా వంట నేనే తినలేకపోయను," అంటూ భాను ఆ నొప్పి ఎక్కువ చేసింది.

★★★★★★★★★

"ఏమయింది అశోక్? అదోలా వున్నావెందుకని" పడుకునేముందు యాభయ్యోసారి అడిగింది భాను.

"ఏమీ లేదు భానూ! కొంచెం అలసటగా అనిపిస్తుంది. అంతే. నువ్వు పడుకో, ప్రయాణంలో అలిసిపోయింటావు."

ఏదో తెలియని బెంగగా అనిపించింది భానుకి.

ఆ బెంగ వారం రోజులైనా తగ్గలేదు. ఎప్పుడూ లేనంత ముభావంగానేకాదూ, ఎన్నడూ లేని బద్ధకం, నిరాసక్తత అతనిలో. తను ఎంతో ప్రేమగా, ప్రత్యేకంగా జర్మనీ నుంచి తెచ్చిన వూలు స్వెట్టరు కూడా అతన్ని సంతోషపెట్టలేదు.

★★★★★★★★★★★

"ఇవాళ ఆదివారం, అశోక్! నీ డాన్సు స్టూడెంట్స్ వస్తారా? మధ్యాహ్నం అన్నం తింటూ అడిగింది.

" ఈ మధ్య రావడం లేదు. మానిపించేసాను."

"అయ్యో! నీకెంతో ఇష్టమైన టీచింగ్, ఎందుకు మానిపించేసావ్? ఈ ఇల్లు వాళ్ళకి దూరమైందా?"

"ఆ, యేం డాన్సులే! ఎవరికీ పెద్ద ఆసక్తి వుండదు, వూరికే వొచ్చి నా టైమంతా వేస్టు."

భాను ఇంక ఆ విషయం రెట్టించలేదు, కానీ ఈ విషయం అంతు తేల్చుకోవాలి అనుకుంది.

★★★★★★★★★★★★★★★★★

సాయంత్రం అయిదింటికి ఆఫీసు బస్సు దిగి మెల్లిగా నడుచుకుంటూ ఇంటి ముఖం పట్టింది భాను. ఇంటికెళ్ళేసరికి అత్తగారు వంట పని మొదలు పెట్టే వుంటారు. తనెళ్ళి మిగతా పని అందుకుంటుంది.

అందరూ భయపెట్టినట్టు అత్తగారితో కలిసి వుండడం ఇప్పటి వరకైతే ఏమీ ఇబ్బందిగాలేదు. ఇంకా నిజం చెప్పాలంటే, ఒంటరిగా పెరిగిన తనకి అమూల్యతో కలిసి వుండడం భలే కొత్తగా, బాగుంది. ఇద్దరూ కలిసి టీవీ చూడడం, షాపింగు చేయడం, కలిసి వొంట నేర్చుకోవడం సరదాగానే వుంది. ముందు ముందు కాలమెలా వుంటుందో కాని.

వున్నట్టుండి ఎవరో తనని పిలిచినట్టనిపించి ఆగింది భాను. ఎవరో ఒకావిడ, తనకంటే కొంచెం పెద్దదై వుంటుంది, ఆగమని చేతులూపుతూ వుంది. ఆగింది భాను.

"నమస్తే, నేను మీ పక్క ఇంట్లో వుంటాను, నిర్మల."

"హలో, నేను భాను. మా వాళ్ళు ఇల్లు మారినప్పుడు నేను వూళ్ళో లేను. అందుకే మీ పరిచయం కాలేదు."

"వూళ్ళోనే కాదు, దేశంలోనే లేరటకదా? మీ అత్తగారు చెప్పారు." నవ్వుతూనే అన్నా ఆమె మాటల్లో ఏదో చురుకు. ఎప్పుడూ కొత్తవాళ్ళ ముందు ఇబ్బంది పడని భానుకి మొదటిసారి ఏదో ఇబ్బందనిపించింది. మళ్ళీ నడక మొదలుపెట్టింది.

"మీరెక్కడ పనిచేస్తారు నిర్మలా?" నడుస్తూ అడిగింది.

"అబ్బే, మా ఇళ్ళల్లో ఆడవాళ్ళు పనిచేస్తే ఒప్పుకోరులెండి. ఇంటి పట్టునే వుంటూ, పిల్లలనీ, అత్త మామలనీ చూసుకుంటూ వుంటాను." మళ్ళీ అదో రకమైన వెక్కిరింత, అమాయకపు మాటలవెనక. భాను ఇంక మాటలాపింది.

"అన్నట్టు మీ ఇంట్లోనించి గజ్జెల చప్పుడు వినపడుతూ వుంటుంది, ఎవరండీ డాన్సు చేసేది? మీ అత్తగారా?" ఏదో గొప్ప జోకు చెప్పుతున్నట్టు నవ్వాపుకుంటున్నట్టు పెదిమలు బిగించి అడిగిందామె. ఆమె వాలకమూ, అడిగిన పద్ధతీ చూస్తే, దీనికోసమే భానుని ఆపినట్టుంది. భాను నివ్వెరపోయింది ఆమె మొరటు మాటలకు.

"ఎవరైతే ఏం లెండి! మీకేదైనా అసౌకర్యంగా వుందా?"

"అదేమీ లేదు, వూరికే అడిగాను. మా వారు కూడా అడిగారు. మీ ఆడపడుచు డాన్సు నేర్చుకుంటున్నారా?"

"లేదండీ. అశోక్, అదే, మా ఆయన, కూచిపూడి డాన్సరు. వీలైనప్పుడల్లా ప్రాక్టీస చేసుకుంటారు, నేర్పిస్తారు కూడా. మీ ఇంట్లో ఎవరికైనా నేర్చుకోవాలనుంటే చెప్పండి." సూటిగా అమె మొహంలోకి చూస్తూ అన్నది.

"అబ్బే, మా ఇంట్లో అంతా మొగ పిల్లలేనండీ. డాన్సులవీ నేర్చుకోమంటే గోల చేస్తారు. అయినా డాన్సులనీ, పాటలనీ పెట్టుకుంటే చదువులు అటకెక్కుతాయి."

ఆమెది నవ్వు మొహమే నిజానికి. అయితే ఆ నవ్వు సంతోషంతో నవ్వుతున్న నవ్వులా కాక, అందరినీ ఎగతాళి చేస్తూ నవ్వుతున్న నవ్వులావుంటుంది. ఆమెతో మాట్లాడడంలో పక్క మనిషికి ప్రయోజనం కానీ, సంతోషమో, ప్రశాంతతో, ఏదీ దొరకవు. భాను మాటలాపేసి ఇల్లు చేరుకుంది.

★★★★★★

"అమ్మా, పక్క ఇళ్ళ వాళ్లతో పరిచయం అయిందా? స్నేహంగా వున్నారా?" సాయంత్రం వంటగదిలో గిన్నెలు సర్దుతూ అడిగింది భాను.

"ఇటు పక్క నిర్మలా వాళ్ళ ఫేమిలీ మన ఇంటికొచ్చి పరిచయం చేసుకున్నారు. కానీ వాళ్ళ వాలకం మాకెవరికీ నచ్చలేదు."

"అవునా? ఎందుకని?"

"ఏదో వేళాకోళం వాళ్ళ మాటల్లో, చూపుల్లో. అన్నయ్య కాలేజీలో లెక్చరరనీ, తీరిక సమయాల్లో డాన్సు నేర్పిస్తారనీ తెలియగానే, ఒకటే నవ్వు!ఆవిడ భర్తైతే పైకే అనేసాడు, సినిమాల్లో ఏమో గానీ, బయట మగవాళ్ళు డాన్సు చేయడం చూడలేదెప్పుడూ, అని. అన్నయ్య కొంచెం చిన్నబుచ్చుకున్నాడు కూడా. పైగా అమ్మతో, సంపాదించే కోడలు, అంటూ ఏవో పిచ్చి మాటలు. మన ఇంటి వెనక వాళ్ళు ఒకసారి కూరగాయల దగ్గర కనిపించారు."

భాను నిట్టూర్చింది.

"అందుకేనా అశోక్ డాన్సు నేర్చుకోవడానికి పిల్లల్ని రావొద్దంది?"

"అదే కాదులే, అన్నయ్య కాలేజీలో కిందటి నెలనించీ సమస్యలట. పెద్దగా ఏమీ చెప్పడంలేదు కానీ, నువ్వొచ్చేముందు అమ్మతో కాలేజీలో వుద్యోగం మానేస్తానన్నాడు. అమ్మ కోప్పడింది. ఎందుకో అన్నయ్య మనసు బాలేదొదినా, దేనిగురించో బాధ పడుతున్నాడు. ఇప్పుడు నువ్వొచ్చావుగా, నీతో చెప్తాడేమోలే."

★★★★★★★★★★★★★★★★★

"నాట్యాంజలి–కూచిపూడి నృత్య పాఠశాల" భాను చేతిలో బోర్డు చూసి ఆశ్చర్యంగా అడిగాడు అశోక్, "ఇదేమిటి?"

"ఇదా, మన ఇంటి ముందు పెడతాను. మా కొలీగ్స్ నలుగురైదుగురు, నిన్ను వాళ్ళ పిల్లలకి డాన్సు నేర్పమని అడుగుతున్నారు. ఇక్కడికి దగ్గరగా వుండే వాళ్ళు కాబట్టి ఈజీగా వచ్చి నేర్చుకుంటారు."

"అబ్బ, వొద్దు భానూ! నన్నడక్కుండా ఇటివంటి పన్లెందుకు చేస్తావు నువ్వు? నాకు డాన్సు చేయడానికికానీ, నేర్పడానిక్కానీ ఓపికా ఆసక్తీ లేవు." కోపంగా అన్నాడు అశోక్.

"అలాగే, నీకిష్టం లేకపోతే చెప్పొద్దు. చెప్పాలనిపిస్తే ఈ బోర్డు వుంటుంది, అంతే. దానికింత టెన్షనూ, కోపమూ యెందుకు?"

సణుక్కుంటూ వెళ్ళిపోయాడు అశోక్.

★★★★★★★★★★★★★

"ఆ బోర్డు పెట్టినా నేర్చుకోవడానికెవరూ రారు భానూ" ఆ రాత్రి పడుకునే ముందు నిరాశగా అన్నాడు అశోక్.

"అవునా? ఎందుకని? నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగింది భాను.

"ఎందుకంటే చాలా మంది వచ్చి వెళ్ళిపోయారు కాబట్టి! ఆడపిల్లలు కొన్నిసార్లు వాళ్ళ అమ్మలతో కలిసి వొస్తారు. చెప్పేది లేడీ టీచరు కాదనీ, అంకులనీ తెలియగానే మెల్లిగా వెళ్ళిపోతారు. వాళ్ళ ఇబ్బందీ సహజమే! డాన్సు నేర్పించడమంటే, చేతులూ, తలా, నడుమూ పట్టుకొని సరిదిద్దాల్సి వుంటుంది. అలా ముట్టుకుంటే వాళ్ళకి ఇబ్బంది గానే అనిపిస్తుంది. అందుకని పంపరు. ఇంకెవరైనా లేడీ టీచరుని చూసుకుంటారు. వాళ్ళనేమీ తప్పు పట్టడానికి లేదు.మగపిల్లలకి డాన్సు

నేర్పించే వాళ్ళెవరైనా వుంటారా? అసలు నిజం చెప్పాలంటే పిల్లలకి ఇంజినీరింగ్, మెడిసిన్ కోచింగ్ తప్ప ఇంకేదైనా నేర్పించే ఆలోచన వుందా మన కుటుంబాల్లో!"

"అవును అశోక్, నువ్వన్నదీ నిజమే. చూద్దాం, ఆ బోర్డు ఇంటి ముందు వుండనీ కొన్నాళ్ళు."

"వొద్దు భానూ! దాన్ని చూసినప్పుడల్లా అది నేనొక ఫెయిల్యూర్ అని వెక్కిరిస్తున్నట్టు వుంటుంది. ఆ బోర్డు ఇంటి ముందు వొద్దు. ఎవరైనా నిజంగా వొచ్చి అడిగితే డాన్సు నేర్పిస్తాలే!"

అతని నోట "ఫెయిల్యూర్" అన్న మాట విని కలవరపడింది భాను.

"అంత చిన్న విషయానికి ఫెయిల్యూర్ అని పెద్ద మాటలెందుకు అశోక్! ఎప్పుడూ లేనిది, అదీ డాన్సు క్లాసుల గురించి. అదేమంత పెద్ద విషయం కాదుగా!"

"డాన్సు నాకు చిన్న విషయం కాదు. నాకు ఎంతో ఇష్టమైన వ్యాపకం. లయబద్ధంగా వేసే అడుగులు నా మనసును సేద తీరుస్తాయి. అయితే, ప్రాక్టీసుకి మోటివేషనే వుండదు. నేర్పిద్దామంటే నేర్చుకునే పిల్లలే వుండరు. పోనీ డాన్సుని వొదిలేయి. మా కాలేజీలో పరిస్థితి ఎంత నిరుత్సాహంగా వుందో తెలుసా? చాలా డిప్రెసింగ్‌గా అనిపిస్తుంది కొన్ని సార్లు."

"కాలేజీలోనా?"

"అవును. ఈ మధ్య పిల్లలకసలు ఎంట్రన్సులకి కావాల్సిన సబ్జెక్టులు తప్ప, ఇంకేవీ పట్టవు. ఏడెనిమిదేళ్ళల్లో ఇంత మార్పా? ఈ సంవత్సరం కాలేజీలో ఒక బుక్ క్లబ్ మొదలు పెడతామంటే, ఒక్కళ్ళు కూడా చేరకపోగా..." ఆపాడు అశోక్.

"ఊ. చెప్పు, ఏమైంది అశోక్?"

"నన్ను చూసి నా వెనక నవ్వుతున్నారు! ఎంత అవమానంగా అనిపించిందో తెలుసా? ఇంటర్ సెకండియర్‌లో బాగా చదివే ఒక అబ్బాయిని పిలిచి అడిగితే, ఇంగ్లీషులో వచ్చే మార్కులు అంత పట్టించుకోనవసరం లేదనీ, పాసు మార్కులొస్తే చాలనీ అన్నాడు. ఒక బియస్సీ అమ్మాయికైతే ఆంగ్ల రచయితల్లో ఒక్కరి పేరు కూడా తెలియదు. అసలు కాలేజీలో ఉద్యోగం వదిలేద్దామని ఆలోచిస్తున్నాను!"

"ఉద్యోగం వదిలేస్తావా? వొదిలేసి ఏం చేద్దామని?" మంచం మీద లేచి కూర్చుంది భాను.

"అబ్బ! భయపడకు భానూ! సీఫెల్‌లో రీసెర్చి గ్రాంటుకి అప్లై చేసాను కిందటి వారం. అది వొచ్చిందంటే అయిదేళ్ళ వరకూ దిగుల్లేదు. ఆ తరవాత అక్కడే ఫేకల్టీలో చేరడానికి ప్రయత్నం చేసుకోవచ్చు."

"స్కాలర్‌షిప్పు ఎంతిస్తారు?"

"స్కాలర్‌షిప్పు కాదు, ఫెలోషిప్. ఎక్కువే వుంటుంది. కాలేజీ జీతం కంటే కొంచెం ఎక్కువే వుంటుంది. ఈ ఫెలోషిప్ ఇచ్చేది యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్. నాలుగేళ్ళలో ఇంకో ఫెలోషిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కొంచెం కష్టపడి యూనివర్సిటీ ఫేకల్టీలో చేరగలిగితే..."

"రిజల్ట్స్ ఎప్పుడొస్తాయి?"

"ఇంత వయసొచ్చినా మనం రిజల్ట్స్ గురించే మాట్లాడుకుంటున్నాం."

నవ్వింది భాను.

★★★★★★★★★★★★★

## 1998- ఆగష్టు

"కవిత్వమొక తీరని దాహం, అని మన శ్రీశ్రీ మహాకవి అన్నట్టే, పోయిట్రీ ఈజ్ ది ఫస్ట్ అండ్ లాస్ట్ ఆఫ్ ఆల్ నాలెడ్జ్ – ఇట్ ఈజ్ ఏజ్ ఇమ్మోర్టల్ అస్ ది హార్ట్ ఆఫ్ మేన్, అని ఆంగ్ల కవి వర్డ్స్‌వర్త్ అన్నాడు," అప్పడాలు వేయిస్తున్న భాను పక్కనే నిలబడి సలాడ్ కోసమని కేరట్ ముక్కలు కోస్తూ అన్నాడు అశోక్.

చాలా రోజుల తరవాత సరదాగా, సంతోషంగా వున్నాడు అశోక్. అతననుకున్నట్టే రీసెర్చి ఫెలోషిప్ వచ్చిందతనికి. అతని సంతోషమూ, ఉత్సాహమూ చూసి గత కొన్ని నెలలుగా తాను అనుభవించిన టెన్షను మరిచిపోయింది భాను.

"శ్రీశ్రీదో మరొకరిదో సంగతి వదిలేసి, కాస్త చేస్తున్న పని మీద శ్రద్ధ పెట్టు! ఆ కేరెట్ ముక్కలు కొంచ్చి చిన్నవీ, కొన్ని పెద్దవీ కోస్తున్నావు! కాస్త అన్నీ ఒకటే సైజులో వుండేటట్టు కోయి."

"వాటె ఫిలస్టైన్!"

"ఇంగ్లీషులో ఏమని తిడుతున్నావ్?"

"ఖర్మ, తిట్టి మళ్ళీ అర్థంకూడా చెప్పాలి. డిక్షనరీ చూసుకోపో!"

"అది సరే, మనకి పిల్లలు పుడితే వాళ్ళకి ఇంగ్లీషు కవుల పేర్లు పెడతావా, లేక తెలుగు రచయితల పేర్లు పెడతావా?"

"హబ్బో! హబ్బో! ఎంత ముందు చూపు! ఎంత ముందు చూపు!"

"నేనడిగిన దానికి జవాబు చెప్పు ముందు!"

"సరే, కొన్ని చాయిస్‌లిస్తా. మగపిల్లల పేర్లు, "శ్రీకృష్ణమిల్టన్", "మాంకుటుంబరావు", లేదా, "చేహయ్య". ఆడపిల్లల పేర్లు, "సులోచనామిచెల్"”

అశోక్ చెప్తూ పోతున్నాడు, భాను పడీ పడి నవ్వుతూనే వుంది.

"ఇక నవ్వింది చాలు కానీ, మాకు అన్నాలు పెట్టేదుందా లేదా?" బయటి నుంచి అమ్మా పిలుపు వినిపించింది.

"ఇవాళ మీ ఇద్దరికీ పుట్టినరోజు. నేను వంట చేస్తానంటే వినకుండా మీరిద్దరూ వంట చేస్తున్నారు!" సుమిత్ర మంచి నీళ్ళు గ్లాసుల్లో పోస్తూ అంది.

"వాళ్ళేం వండారో, మనమేం తినాలో!" అమ్మా పళ్ళేలు పెడుతూ గునిసింది.

"నువ్వేం టెన్షన్ పడకు తల్లీ! మామిడికాయ పప్పూ, వంకాయ కూరా, కొబ్బరి పచ్చడి, టమాటా చారూ, అప్పడాలు, మీ అన్నయ్య చేసిన ఎగుడు దిగుడు ముక్కల సలాడ్! చాలా ఇంకేమైనా కావాలా?" భాను గిన్నెలు చూపిస్తూ వివరించింది.

"మరి స్వీటు?"

"స్వీటు మాకిద్దరికీ చేతకాదు కాబట్టి అత్తయ్య చేసిన మైసూర్ పాక్ వుంది."

"అమ్మా నాన్నలని కూడా రమ్మనాల్సింది భానూ!" సుమిత్ర అంది.

"వాళ్ళు బంధువుల పెళ్ళికని ఖమ్మం వెళ్ళారత్తయ్యా!"

"అమ్మా! రేపు కాలేజీలో రాజీనామా ఇస్తున్నాను. రెండు వారాల్లో సీఫెల్‌లో రీసర్చరుగా కొత్త ఉద్యోగం!"

"ఫెలోషిప్ అంటే మరి జీతం అదీ,"

"ఫరవాలేదు బాగానే వొస్తుందమ్మా! కాలేజీలో వచ్చేంతే వస్తుంది,"

ఫోన్ మోగింది.

చేతులు కడుక్కొని అశోక్ లేచి ఫోన్ ఎత్తాడు.

"వంట చాల బాగుంది వదినా! మామిడికాయ పప్పైతే సూపర్!"

"థాంక్‌యూ, థాంక్‌యూ!"

"అవునూ, ఆగస్టులో మావిడికాయలు ఎక్కడివి?"

"అవి మావిడికాయ ఒరుగులు. అంటే, మార్చి ఎప్రిల్‌లో దొరికే మావిడికాయలు ఎండబెట్టి స్టోర్ చేస్తారు. అమ్మ ఆ మధ్య పంపించింది. అవి పెట్టి చేసాను."

"భానూ," అశోక్ ఫోన్ పెట్టేసి డైనింగ్ టేబిల్ దగ్గరికొచ్చాడు.

అతని గొంతులో, మొహంలో ఏదో టెన్షన్.

"ఏమైంది అశోక్?" అదుర్దాగా అడిగింది భాను.

"వెంకట్ గాడికి ఏక్సిడెంటయింది. తలకి బాగా దెబ్బ తగిలిందట. హాస్పిటల్లో వున్నాడు. నేను హాస్పిటల్‌కి వెళ్ళొస్తాను. వాళ్ళ తమ్ముడు ఫోన్ చేసాడు."

"భోజనం పూర్తి చేసి వెళ్ళు అశోక్!"

తల్లి వంక ఒక్క సారి అన్యమనస్కంగా చూసి, గబ గబా భోజనం ముగించి లేచి వెళ్ళాడు అశోక్.

మిగిలిన ముగ్గురు ఆడవాళ్ళకీ ఏదో దిగులు చుట్టుముట్టినట్టైంది.

రాత్రి పదకొండైనా అశోక్ ఇంటికి రాలేదు. టీవీ చూసినంత సేపు చూసి పడుకుందామనుకుంటున్నారు ముగ్గురూ. తలుపు తెరుచుకొని లోపలికొచ్చాడు అశోక్.

"ఏమైంది అశోక్? వెంకట్ కెలా వుంది?"

"అమ్మా, వెంకట్ చచ్చిపోయాడు!" తల్లిని పెనవేసుకొని బావురుమన్నాడు అశోక్! ★★★

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS